నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 337 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 14 జులై 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా సవరణ!

**న్యూఢిల్లీ, జులై 13 (నమస్తే ఉదయం)**

బీహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఓటర్ జాబితా సవరణ వచ్చే నెల నుంచి మొదలవుతుందని కేంద్రం ఎన్నికల సంఘం తెలిపింది. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) కోసం చేపట్టాల్సిన ఇంటింటి సర్వే కోసం తమ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నట్టు ప్రకటించింది. బీహార్‌లో ఓటర్ జాబితా సవరణపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఈ ప్రక్రియ చేపట్టే అధికారం ఈసీకి ఉందని తీర్పు చెప్పింది. దీంతో దేశవ్యాప్తంగా సవరణ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. దీంతో ఈసీలు చివరిసారి సమగ్ర సవరణ చేపట్టిన అనంతరం ప్రచురించిన జాబితాను వెబ్‌సైట్‌లోఅందుబాటులో ఉంచుతున్నారు. కాగా, బీహార్ ఓటర్ల జాబితాలో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్‌కు చెందిన అక్రమ వలసదారుల పేర్లు పెద్ద ఎత్తున ఉన్నట్టు తేలింది.



# కన్నుమూసిన కోట శ్రీనివాసరావు

## మేటి నటుడికి కడసారి వీడ్కోలు

జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిసిన కోట అంత్యక్రియలు

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైనం

కోటకు అంతిమ సంస్కారాలు నిర్వహించిన పెద్ద మనవడు శ్రీనివాస్

2

# బోనాల సంబరం





### ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

### ఇతర మంత్రులు కూడా ఈ వేడుకలో పాల్గొన్న వైనం

### ప్రత్యేక పూజలు చేసిన సీఎం, మంత్రులు

**హైదరాబాద్, జులై 13 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి లష్కర్ బోనాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు కేబినెట్ సహచరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయబద్ధంగా, ఉ త్సాహంగా ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.మంత్రి సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తన అర్ధాంగితో

..మిగతా 2లో

# తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలతో తీవ్ర దుమారం

### కవితపై తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు

### ఆఫీసుపై దాడిచేసిన జాగృతి కార్యకర్తలు

### బీసీలను అణగదొక్కే ప్రయత్నమని ఆరోపణ

**హైదరాబాద్, జులై 13 (నమస్తే ఉదయం)**

తన కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేయడంతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత , ఆమె కుటుంబం తనను చంపడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఇలాంటి దాడులతో బీసీ ఉద్యమం ఆగిపోతుందని అనుకుంటే పొరపాటేనని మల్లన్న అన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో 30 మంది తన కార్యాలయంపై దాడి చేశారని మల్లన్న చెప్పారు. తన గన్‌మెన్లు ఆపడానికి ప్రయత్నించినా తోసుకుంటూ లోపలికి వచ్చారని తెలిపారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి గాయమైందని చెప్పారు. తన గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కొని కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారని మల్లన్న ఆరోపణలు చేశారు. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాల కోసం చేసే ప్రయత్నాలు ఆగవని మల్లన్న

..మిగతా 2లో





### రాజ్యసభకు

# నలుగురు ప్రముఖులు

### నామినేట్ చేసిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ, జులై 13 (నమస్తే ఉదయం)**

రాజ్యసభకు నలుగురు కొత్త సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా నామినేట్ చేశారు. పలువురు సభ్యుల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో కొత్త సభ్యులను

..మిగతా 2లో



## తీన్మార్ మల్లన్నను

# అరెస్ట్ చేయాలి



### కవిత డిమాండ్

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కవిత సంబరాలు

### కవితకేంటి సంబంధం అంటూ తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు

### డీజీపీకి, శాసనమండలి ఛైర్మన్‌కు కవిత ఫిర్యాదు

**హైదరాబాద్, జులై 13 (నమస్తే ఉదయం)**

తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ డీజీపీకి, శాసనమండలి

..మిగతా 2లో



## జూరాల ప్రాజెక్టుకు

# తగుతున్న వరద

**గద్వాల, జులై 13 (నమస్తే ఉదయం)**

జూరాలకు వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు వరద ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివారం కొన్ని గేట్లను మూసివేశారు. ఆదివారం సాయంత్రానికి జూరాలకు 65,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, అవుట్ ఫ్లో 47,068 నమోదైంది. వరద తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా 6,823 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తికి 36,035, కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు 315, నెట్టెంపాడ్ కాల్వకు 750, కుడికాల్వకు 470, ఎడమ కాలువకు 1,030, సమాంతర కాలువకు 950, భీమా లిఫ్ట్ 2కు 750, క్యూసెక్కుల చొప్పున నీటిని అధికారులు విడుదల చేశారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657కాగా, ప్రస్తుతం 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

# తీన్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఆమె వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. మల్లన్నను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని, అతడిని అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**వివరాల్లోకి వెళితే..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ఎమ్మెల్సీ కవిత హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. దీనిపై తీన్మార్ మల్లన్న స్పందిస్తూ, బీసీ రిజర్వేషన్లకు, కవితకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆమెపై కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. బీసీలతో ఆమెకు కంచం పొత్తు ఉందా, మంచం పొత్తు ఉందా అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం చెలరేగింది.

మల్లన్న వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆయన కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసమైంది. తనపై, జాగృతి కార్యకర్తలపై కాల్పులకు పురిగొల్పేలా మల్లన్న మాట్లాడారని కవిత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని, బీసీల పక్షాన పోరాడుతున్నందుకే తనపై ఉద్దేశపూర్వకంగా దాడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

ఎరోవైపు, తన కార్యాలయంపై దాడి జరిగిన ఘటనపై తీన్మార్ మల్లన్న కూడా స్పందించారు. కవిత అనుచరులు తనపై హత్యాయత్నం చేశారని, తన గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరపడంతో ప్రాణాలతో బయటపడ్డానని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



# తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలతో తీవ్ర దుమారం

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. మరింత ఉత్సాహంతో ముందుకెళ్తామని ఆయన అన్నారు. ఇలాంటి వాటికి తాను భయపడనని ఆయన తేల్చి చెప్పారు. 'రాసి పెట్టుకోండి.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది" అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో తాము పోరాడుతున్నామని మల్లన్న తెలిపారు. ప్రభుత్వం తమ సలహాలను స్వీకరిస్తోందని, పొరపాట్లు జరిగితే సరిచేసుకుంటోందని ఆయన అన్నారు. ఈ విషయంలో కవితకు ఎందుకు బాధ కలుగుతుందో అర్థం కావడం లేదని మల్లన్న ప్రశ్నించారు.

రాజకీయ ఉనికి కోసం అయితే కేసీఆర్‌ను అడగాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ కవితకు తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్‌పై ఉన్న కోపం.. తమపై చూపిస్తే కుదరదని మల్లన్న అన్నారు. 10 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని మీ కుటుంబం దోచుకుందని మల్లన్న ఆరోపించారు. ఇలాంటి దాడులతో మరింత దిగజారి ప్రజల్లో చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదని ఆయన అన్నారు. సహచర ఎమ్మెల్సీపై దాడులకు ప్రేరేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మల్లన్న డిమాండ్ చేశారు. 'మా కార్యాలయంలో పడిన రక్తపు మరకల సాక్షిగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తాం' అని ఆయన అన్నారు. కాగా, జాగృతి కార్యకర్తలను అదుపుచేయడానికి మల్లన్న గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ సమయంలో ఓ బుల్లెట్ జాగృతి కార్యకర్త భుజం మీదుగా దూసుకెళ్లడంతో అతడికి గాయమైంది.



# రాజ్యసభకు నలుగురు ప్రముఖులు

**మొదటి పేజీ తరువాయి...**

నామినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాహిత్యం, సైన్స్, కళలు మరియు సామాజిక సేవ వంటి రంగాలలో విశేష సేవలందించిన ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(ఏ) ద్వారా సంక్రమించిన అధికారంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా లాయర్ ఉజ్వల్ నిగమ్, సదానందన్, హర్షవర్ధన్, మీనాక్షి జైన్ లను రాజ్యసభ సభ్యులుగా నామినేట్ చేశారు.

**ఇదీ నేపథ్యం..**

ఉజ్వల్ దేవరావు నికమ్.. 26/11 ముంబై ఉగ్రవాద దాడులతో సహా అనేక ఉన్నత స్థాయి క్రిమినల్ కేసులను వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్.

సదానందన్ మాస్టే.. కేరళలో అట్టడుగు వర్గాలకు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న సామాజిక కార్యకర్త, విద్యావేత్త.

హర్ష్ వర్ధన్ ష్రింగ్లా.. భారత మాజీ విదేశాంగ కార్యదర్శి, దౌత్యవేత్త.

డాక్టర్ మీనాక్షి జైన్.. ప్రముఖ చరిత్రకారిణి, విద్యావేత్త.



# మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

**పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్**

**ఇటీవల ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్**

**ఆ సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని వార్తలు**

**వివరణ ఇచ్చిన పాక్ ప్రధాని**

న్యూఢిల్లీ, జులై 13 (నమస్తే ఉదయం)

భారత్ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని, పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలను ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి "అణు బ్లాక్‌మెయిల్" కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ తమ "సంపూర్ణ బలంతో" ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది.

ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# రైళ్లలో ఇక భద్రతకు పెద్దపీట

**ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ కీలక నిర్ణయం**

**74 వేల రైలు కోచ్‌లలో సీసీ కెమెరాలు**

**ఇప్పటికే ట్రయల్స్ నిర్వహణ**

న్యూఢిల్లీ, జులై 13 (నమస్తే ఉదయం)

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రైల్వే శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 74,000 రైలు కోచ్‌లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తలుపుల వద్ద ఈ కెమెరాలు అమర్చనున్నారు. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే దుండగులు మరియు ముఠాలను నిరోధిస్తుందని అధికారులు భావిస్తున్నారు. నార్తర్న్ రైల్వేలో లోకో ఇంజన్లు మరియు కోచ్‌లలో విజయవంతంగా సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టూ మరియు రైల్వే బోర్డు అధికారులు లోకోమోటివ్‌లు మరియు కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ మరియు ఏర్పాటు యొక్క పురోగతిని సమీక్షించారు. ప్రతి రైలు కోచ్‌కు డోమ్ తరహా నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రవేశ మార్గంలో రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా, ప్రతి లోకోమోటివ్‌లో ఆరు సీసీటీవీ కెమెరాలు ఉంటాయి. వీటిలో ఒకటి ముందు వైపు, ఒకటి వెనుక వైపు మరియు రెండు వైపులా ఉంటాయి. లోకో యొక్క ప్రతి క్యాబ్‌లో (ముందు మరియు వెనుక) ఒక డోమ్ సీసీటీవీ కెమెరా మరియు రెండు డెస్క్-మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమర్చబడతాయి. గంటకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే రైళ్లలో కూడా మరియు తక్కువ వెలుతురు ఉన్న పరిస్థితుల్లో కూడా అధిక-నాణ్యత గల దృశ్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైష్ణవ్ రైల్వే అధికారులను కోరారు. ఇండియా ఏఐ మిషన్‌తో భాగస్వామ్యంతో, సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని అన్వేషించాలని రైల్వే మంత్రి అధికారులను ప్రోత్సహించారు.



# బోనాల సంబరం

**మొదటి పేజీ తరువాయి...**

కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. మహిళా భక్తులు అన్నం, బెల్లం, పెరుగు, వేప ఆకులతో వండిన 'బోనం'ను అమ్మవారికి సమర్పించారు. ఆలయం, దాని చుట్టుపక్కల వీధులన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. సంప్రదాయ వస్త్రధారణతో ఉన్న మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. 'రంగం'తో ఈ పండుగ ముగుస్తుంది. ఈ 'రంగం'లో అవివాహిత మహిళ రాష్ట్ర భవిష్యత్తు గురించి అంచనాలను వెల్లడిస్తారు. ఆ తర్వాత ఘట్టాల ఊరేగింపు జరుగుతుంది. దీని తరువాత అమ్మవారి చిత్రపటాన్ని మోస్తున్న అలంకరించిన ఏనుగుతో ఊరేగింపు ఉంటుంది. పసుపు, కుంకుమ పూసుకున్న పోతరాజులు లయబద్ధమైన డప్పుల శబ్దానికి నృత్యం చేస్తూ ఊరేగింపుగా వివిధ ప్రాంతాల గుండా వెళతారు. ఆషాఢ బోనాలు హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసంలో మహంకాళి అమ్మవారిని ఆరాధించే పండుగ. భక్తులు, ముఖ్యంగా మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన కుండలలో ఆహారం రూపంలో నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ పండుగలో భాగంగా ప్రజలు 'రంగం' లేదా భవిష్యత్తు అంచనా, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సికింద్రాబాద్‌లో జరిగే బోనాలను లష్కర్ బోనాలు అని కూడా పిలుస్తారు. ఇది హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ జంట నగరాల్లో దాదాపు నెలరోజుల పాటు జరిగే సంప్రదాయ పండుగలో రెండవ దశ. ఈ పండుగ గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో ప్రారంభమైంది. పాతబస్తీలోని లాల్ దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయం, హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో వచ్చే ఆదివారం ఉత్సవాలు జరగనున్నాయి. సుమారు 150 సంవత్సరాల క్రితం కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలిన తర్వాత ఈ పండుగ మొదట జరుపుకున్నారని నమ్ముతారు. మహంకాళి అమ్మవారి కోపం వలనే ఈ మహమ్మారి వచ్చిందని ప్రజలు నమ్మి, ఆమెను శాంతింపజేయడానికి బోనాలు సమర్పించడం ప్రారంభించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించింది.

# బీహార్‌లో బంగ్లాదేశీయులకూ ఓటుహక్కు

**ఓటర్ జాబితాలో నేపాల్, మయన్మార్ పౌరుల పేర్లు**

**ఎలక్షన్ కమిషన్ సవరణ సర్వేలో బయటపడుతున్న అక్రమాలు**

**అనర్హులను ఏరివేస్తామంటున్న ఈసీ అధికారులు**

న్యూఢిల్లీ, జులై 13 (నమస్తే ఉదయం)

అసెంబ్లీ ఎన్నికల సంసిద్ధత కోసం బీహార్ లో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) చేపట్టిన ఓటర్ జాబితా సవరణ సర్వేలో పలు షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి. బీహార్ లో అక్రమంగా నివాసం ఉంటున్న పలువురు బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ పౌరులు కూడా ఓటు హక్కు పొందారని తేలింది. ఓటర్ జాబితాలో వారి పేర్లు ఉన్నాయని ఈసీ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1 నుంచి ఇలాంటి అనర్హుల పేర్లను ఓటర్ జాబితాలో నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఈ సర్వేపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, ఈసీ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించాయి. అనర్హుల పేరుతో ప్రతిపక్షాల ఓటు బ్యాంకును ఓటర్ జాబితా నుంచి తొలగించేందుకే ఈ సర్వే చేపట్టిందని ఆరోపించాయి. ఈ విషయంపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈసీ చేపట్టిన సర్వే రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. ఎన్నికల ముందు సర్వే చేయడంపై ఈసీని ప్రశ్నించింది.

# కన్నుమూసిన కోట శ్రీనివాసరావు

హైదరాబాద్, జులై 13 (నమస్తే ఉదయం)

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు గారి అంత్యక్రియలు ముగిశాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం (జూలై 13) ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు.

సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ఆయన అంత్యక్రియలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. ఆయన పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఫిల్మ్ నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర సాగింది. వందలాది మంది సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు కడసారి నివాళులర్పించారు.



మెగాస్టార్ చిరంజీవి, ప్రకాశ్ రాజ్, వెంకటేశ్, రానా దగ్గుబాటి వంటి పలువురు సినీ ప్రముఖులు కోట శ్రీనివాసరావుకు నివాళులర్పించారు. చిరంజీవి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వీరిద్దరూ ఒకే సినిమాతో (ప్రాణం ఖరీదు, 1978) తమ సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర రాజకీయ ప్రముఖులు కూడా ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావు తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా తన సినీ జీవితంలో 750కి పైగా సినిమాల్లో నటించారు. ఆయన విలక్షణమైన నటనకు, ముక్కుసూటి వ్యక్తిత్వానికి పేరుగాంచారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్న కోట శ్రీనివాసరావు 1999 నుండి 2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు.

# కామ్రేడ్ విజయ్ మృతి భారత విప్లవోద్యమానికే తీరని లోటు

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం





జనగామ, జులై 13(నమస్తే ఉదయం): యుసిసిఆర్ఐ(యం.యల్)ముఖ్య (రాష్ట్ర) నాయకులు కామ్రేడ్ శిష్టా విజయ్(శర్మ) 76 మృతి భారత విప్లవద్యమానికే తీరని లోటు అని సిపిఐ(మాస్ లైన్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం ఆదివారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చాలాకాలంగా కిడ్నీ వ్యాదితో గత కొద్ది రోజులుగా డయాల్సిస్ తో బాదపడుతూ , జులై-12, రాత్రి 9 గంటలకు తన చివరి శ్వాస నొదిలారని. గుర్తుచేశారు. ఎందరో వృత్తి విప్లవకారులుగా తీర్చి దిద్దిన ఫలితంగా నేడు తనుకూడ విప్లవ రాజకీయాల్లో కొనసాగడానికి కారణం అయ్యారని అన్నారు. తనకు ఆయన తన మొదటి రాజకీయ గురువుగా గడ్డం సదానందం ప్రకటించారు. సిద్దాంత రాజకీయ బోదనలు, ఆయన నిర్మాణ కృషి, ఆకాంక్ష, భారత జనతా ప్రజాతంత్ర విప్లవానికై ఆయన త్యాగం హిమాలయాల కంటే ఉన్నత మైనదని కొనియాడారు. విజయ్ సార్ విప్లవ కృషికి రెడ్ సెల్యూట్, లాలాసలాం తెలియజేస్తున్నామని అన్నారు. ఆయన బోధించిన విప్లవ నైతిక విలువలను జీవిత కాలమంతా పాటిస్తామని ఈ సందర్భంగా ప్రతినబూనారు. అది కామ్రేడ్ విజయ్ కి తను అందించే వినమ్ర అశ్రు నివాళి అని తెలియజేస్తూ బావోద్వేగానికి గురైయ్యారు. తన 16వ యేట (1990) నుండి 2017 వరకు తల్లి తండ్రులనూ, కుటుంబాలను మరిపించిన విజయ్ సార్ లాంటి పీడిత వర్గాల ప్రతినిధి ఇక లేరని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైయ్యానని వెల్లడించారు. మార్క్సిజం- లెనినిజం- మావో ఆలోచనా విధానంను బోదించి, దానిని భారత నిర్దిష్ట పరిస్థితులకు ఎలా అప్లై చేసుకోవాలో, పార్టీ నిర్మాణం, ఐక్య సంఘటన, ఎత్తుగడలను రంగరించి పోసి, వివిధ రంగాల ప్రజలను ఎలా ఆర్గనైజ్ చేయాలో ముఖ్యంగా కార్మిక వర్గంలో ఎలా పని చేయాలో, బలపం పట్టి నేర్పించిన తమ విప్లవ గురువు అస్తమించాడని తెలిసాక జీర్ణం చేసుకోవడానికి కష్టంగా ఉందని సదానందం తన మనోవేదనను, బాదను పత్రిక ముఖంగా తెలియజేశారు. ఆయన ఆశయాల సాధనకై చివరికంటా కృషి సల్పుతామని, అదే కామ్రేడ్ విజయ్ తమ నుండి కోరుకున్నారని గుర్తుచేశారు. దాన్ని నిజాయితీగా అమలు జరుపటమే తమ ముందున్న కర్తవ్యం అని,సూర్యచంద్రులు ఉన్నంత వరకూ ఈ సృష్టి నడిచినంత వరకు, పీడిత తాడిత ప్రజానీకానికి ముఖ్యంగా కార్మిక వర్గానికి వేగుచుక్కై దారి చూపుతాయని కొనియాడారు.బ్రాహ్మణోత్తముల కడుపున జన్మించి, రాడికల్ హ్యూమనిస్ట్ గా మారి, అనంతరం కమ్యూనిస్టు విప్లవ కారుడిగా మారిన ఎస్.వి.ఎస్. సుబ్బారాయుడు తమ్ముడిగా ఆయన ద్వారా మహత్తర తెలంగాణ ప్రజల సాయుధ పోరాటం (1946-51) కు నాయకత్వం వహించిన భారత విప్లవోద్యమ నాయకులు అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వ రరావు (డివి), సహచర కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి (టి.యన్)ల రాజకీయాలతో ప్రేరణ పొందిన విజయ్ సార్, యుసిసిఆర్ఐ (యం.యల్) నాయకుడు కామ్రేడ్ బాస్కర్ అయ్యర్ తో కలిసి, కేంద్ర ప్రభుత్వ ఎన్.ఎఫ్.సి కొలువు ను విడిచిపెట్టి, కమ్యునిస్టు విప్లవ జీవితాన్ని ఎంచుకుని సమ సమాజ స్థాపనకై, వృత్తి విప్లవకారుడిగా మారాడని అన్నారు. డివి-టియన్ లు మరణించిన జులై మాసంలోనే, అదీకూడా జులై 12 నే తన చివరి శ్వాస నొందారని గుర్తుచేశారు.రహస్య జీవితం గడుపుతున్న విజయ్ బ్రాహ్మణోత్తముడని, ఆయన తన బ్రాహ్మణీయ బావ జాలంలోని అంట రానితనం, అస్పృశ్యతలను ఏవగించుకొని, ఆదిపత్యపు, విషపూరిత, దోపిడీ పూరిత, మోసపూరిత దుర్మార్గాలపై చివరి కంటా పోరాడి, స్త్రీలు పురుషులు మనుషులందరూ సమానమని చాటిన గొప్ప వ్యక్తని అన్నారు. అయన ఒక కరుడు గట్టిన కమ్యునిస్టు విప్లవ కారుడిగా, కఠినమైన కమ్యూనిస్టు విప్లవ జీవన విదానాన్ని ఆచరించి, ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కామ్రేడ్ విజయ్ ఎన్నో నిర్భందాలను, ఆటుపోట్లను,చిత్రహింసలను బరించి, చావు అంచలదాక వెళ్ళి వచ్చారని, విప్లవం పట్ల గల అకాక్షా దీక్షయే అతన్ని మామూలుగా మార్చిందని, అది అయన విప్లవ రాజకీయ సిద్దాంత బలమేనని స్పష్టం చేశారు. ఆయన విడిచి వెళ్ళిన ఆశయాలను తుదికంతా కొనసాగిస్తామని తెలియజేస్తూ గడ్డం సదానందం విప్లవ జోహార్లు అర్పించారు.



కొలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, వాసు బాబు కు అమ్మవారి చిత్రాలను బహుకరించిన డి రమేష్ ముదిరాజ్

## లక్ష్మీగూడ శ్రీ పోచమ్మ తల్లిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు

బుద్వేల్ , జులై 13(నమస్తే ఉదయం):రాజేంద్రనగర్ సర్కిల్ లక్ష్మీగూడ లో నూతనంగా నిర్మిం చిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి దీవెనలు ప్రజలం దరి మీద ఉండాలని మొక్కుకున్నానని ఈ సందర్బంగా ఆయన తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ సుభాష్ రెడ్డి తో పాటు జాలిగం చిత్తారి. శివ ముదిరాజ్, వాసు బాబు లకు లక్ష్మీగూడ శ్రీ పోచమ్మ దేవాలయం తరపున స్థానిక నాయకులు డి.రమేశ్ ముదిరాజ్ అమ్మవారి ఫోటోలను బహుకరించి సన్మానించారు.

## రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు దుర్మరణం

బుద్వేల్, జులై13(నమస్తే ఉదయం): ఆటో ఢీ కొని ఓ యాచకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన మైలార్దేవుపల్లి డివిజన్ ఉడంగడ్డ జీఎంఆర్ వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగింది. 40 సంవత్సరాల వయస్సు గల యాచకుడు రోడ్డు దాటుతుండగా ఆటో అతన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో యాచకుడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న మైలార్దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసు న్నారు.



చిల్లా వద్ద ప్రార్థనలు చేస్తున్న శాసన మండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్, మహ్మద్ మూర్తుజా అలీ తదితరులు

## వాదియే మహమూద్ అభివృద్ధికి కృషి: మీర్జా రహ్మత్ బేగ్

బుద్వేల్, జులై13(నమస్తే ఉదయం): సులేమాన్ నగర్ వాదియే మహమూద్ పిల్లర్ నెంబర్ 240 దగ్గర ఉన్న చిల్లా లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్, మజ్లిస్ నాయకులు నవాజుద్దీన్, మహ్మద్ మూర్తుజా అలీ, తాహేర్ ఖాన్, మహ్మద్ గౌస్ లు పాల్గొన్నారు. వాదియే మహమూద్ లో పర్యటిం చారు. బస్తీ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మజ్లిస్ పార్టీ ముం దుండు పనిచేస్తుందన్నారు.



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి సమక్షంలో బీ ఆర్ ఎస్ లో చేరిన నాయకులు

## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు, నాయకులు

బుద్వేల్, జులై13(నమస్తే ఉదయం) బాబుల్ రెడ్డినగర్, వెంకటేశ్వర కాలనీ, ఆదర్శ కాలనీ లకు చెందిన పలువురు యువకులు, నాయకులు ఆదివారం మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి.కార్తీకరెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పి.సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డి లు మాట్లాడుతూ, తమను నమ్ముకుని తమ సమక్షంలో పార్టీలో చేరిన వారికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం పనిచేసే కుటుంబం ఇంద్రారెడ్డి కుటుంబం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్ తదితరులు ఉన్నారు.



హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా తన ఆత్మ కథ పుస్తకాన్ని అందుకుంటున్న బీజేపీ నాయకులు సాబద విజయ్ కుమార్

## ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని అందుకున్న విజయ్ కుమార్

బుద్వేల్, జులై 13(నమస్తే ఉదయం) : ప్రతి ఒక్కరి జీవితంలో ఒడిదుడుకులు సహజమేనని, వాటిని అదిగమించిన వారే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలుగుతారని హర్యాన రాష్ట్ర గవర్నర్ బం డారు దత్తాత్రేయ అన్నారు. శంషాబాద్ లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న బం డారు దత్తాత్రేయ రాసిన ప్రజల కథే నా ఆత్మకథ అనే పుస్తకాన్ని పలువురు బీజేపీ నాయకులకు అందజేశారు. ఈ సందర్బంగా సాబద విజయ్ కుమార్ మాట్లాడుతూ, గవర్నర్ బండారు దత్తా త్రేయ చేతుల మీదుగా ఆయన రాసిన ఆత్మకథ పుస్తకాన్ని అందుకోవడం అదృష్టంగా బావిసు న్నానన్నారు. పుస్తకంలో ఆయన జీవిత సందేశంతో పాటు దేశ సేవ పట్ల నిబద్ధత, ప్రజల పట్ల ప్రేమ, ఆత్మీయత, సుదీర్ఘ రాజకీయ ప్రస్థావన కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రం గారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్, గుమ్మడి రాంచంద్రారెడ్డి, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్, నాయకులు ఎన్.మల్లారెడ్డి, పొన్నమోని మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో కారులో మంటలు..



శంషాబాద్,జులై 13(నమస్తే ఉదయం) శంషాబాద్ అంతర్జాతీయ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఓ బెంజ్ కారులో మంటలు చెలరేగాయి.ఎయిర్‌పోర్టు అవుట్ పోస్టు సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 11 గంటల సమీపంలో శ్రీకాంత్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న క్రమంలో వోల్వో కారు సిఐఎస్ఎఫ్ చెకపోస్టు సమీపానికి రాగానే కారులో నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ కారులో నుంచి కిందకు దిగిపోయాడు.విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు పూర్తిగా ఆర్పివేశారు.అప్పటికే కారు ముందుభాగం దెబ్బతిన్నట్లు చెప్పారు.కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు.అతడికి ఎలాంటి గాయాలు కాలేదు.దీంతో ఆటు పోలీసులు,ఇటు ప్రజలు ఎయిర్‌పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మైలార్ దేవుపల్లి దేవాలయాల కమిటీ నాయకులు రావుల భాస్కర్ ను సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

## రావుల భాస్కర్‌కు సన్మాణం

బుద్వేల్, జులై 13(నమస్తే ఉదయం): బోనాల ఉత్సవాల సందర్బంగా మైలార్ దేవుపల్లి బసీ లోని అమ్మవారి దేవాలయం వద్ద మైలార్దేవుపల్లి ఉమ్మడి దేవాలయాల కమిటీ ప్రధాన కార్యదర్శి రావుల భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్డి తదితరులు పాల్గొన్నారు.



బైబిల్ సందేశాలను వివరిస్తున్న రెవరెండ్ అబ్రహాం లింకన్

## దేవుని మాట గొప్పది

### రెవరెండ్ అబ్రహాం లింకన్

బుద్వేల్, జులై 13 (నమస్తే ఉదయం) : దేవుని మాట కోసం ఎదురు చూసే వారిగా ప్రతి క్రైస్తవుడు ఉండాలని, క్రైస్తవ ఆధ్యాత్మిక బోధకుడు అబ్రహం లింకన్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చిలో, చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన ఆదివార ఆరాధనలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాల ను అందజేశారు.

దేవుని శక్తి కోసం , అద్భుతాల కోసం కాకుండా యేసయ్య మాట కోసం ఎదురు చూస్తే అన్ని జరుగుతాయన్నారు. యేసయ్య మాటలోనే శక్తి ఉంటుందన్నారు. యేసయ్యను నమ్మేవారిగా ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. యేసయ్య శిష్యులను తయారు చేశారని, ఆ విధంగానే నేడు ప్రతి ఒక్కరు యేసయ్య బోధనలను ఇతరులకు అందించే శిష్యులనుగా తయారు చేయాలన్నారు. ప్రతి క్రైస్తవుడు యేసయ్య మనసును కలిగి జీవించాలన్నారు. దేవుని మాటలో సర్వాధికారం ఉందని గుర్తు చేశారు. ఆయన చెప్పిన మాటలు విని ఆ విధానమైన జీవితాన్ని జీవిస్తే అంతా మేలు జరుగుతుందన్నారు.

# లక్ష్మీగూడ, మైలార్దేవుపల్లి బస్తీలలో ఘనంగా బోనాల జాతర



మైలార్ దేవుపల్లి లో జరిగిన తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



మైలార్ దేవుపల్లి లో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



బోనాల ఊరేగింపులో పాల్గొన్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి



గగన్ పహాడ్‌లో బోనాల ఊరేగింపు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

బుద్వేల్, జులై13(నమస్తే ఉదయం) : మైలారేవుపల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహడ్, లక్ష్మీగూడ, మైలార్దేవుపల్లి బస్తీలలో ఆదివరం బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మైలారేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్రెడ్డి, మాజీ కౌన్సిలర్, మైలార్దేవుపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్, మైలార్ దేవుపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎస్. తిరుపతిరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు డి.రమేశ్ ముదిరాజ్, అడికె రాజు. అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్, రావుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు అంగరంగవైభవంగా జరిగాయి. పోతురాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపులు ఆకట్టుకున్నాయి.

# రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు: సుభాషిణి ఆలీ


ఆవాజ్ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ


ఆవాజ్ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై13(నమస్తే ఉదయం) భారత రాజ్యాంగంపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని అందుకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు. ఆవాజ్ రాష్ట్ర 3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుండి ర్యాలీ ప్రారంభించి, పట్టణ పుర విధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తేరు మైదానంలో అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని అందుకే, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఏఏ ఎన్ ఆర్ సి %జూాూ చీ=జ% చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందని,అందుకనే పరదచాటున ఉన్న మైనార్టీ మహిళలు తమ హక్కుల కోసం రోడ్ల పైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. మైనారిటీల దేశభక్తినిఎవరు గుర్తించవలసిన అవసరం లేదని, తాము భారతదేశ పౌరులమని అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తమకు సర్వ హక్కులు కల్పించారని అన్నారు. స్వశక్తి తో అన్ని రంగాలలో మహిళలు ముందుకు వెళుతుంటే బీజేపీ మాత్రం మహిళ హక్కులను నిరాకరిస్తున్నదని, విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను హరిస్తే తిరగబడతామని హెచ్చరించారు.భేటీ పడవో భేటీ బచావో అంటూ నినాదాలు ఇస్తున్న బీజేపీ తాను అధికారంలో ఉన్న యూపి, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ఆడ పిలల్లపై జరుగుతున్న అరాచకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. దళిత ఆదివాసి మహిళలపై దుర్మార్గలు ఆగడం లేదని బీజేపీ అధికారం లో ఉన్న రాష్టాలలో వారి దురాగాతలకు అంతం లేదని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకలి పేదరికం నిరుద్యోగం పెరిగిందని వాటి నుండి తప్పించుకోవడానికి మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ అంబానీలు ఆదానిలకు ఉద్యోగాలు ఇచ్చి, దేశ సహజ వనరులను దోచుకోవడానికి అవకాశం ఇచ్చారని , రైతులు కూలీలకు కార్మిక వర్గాన్ని మాత్రం దోపిడీ పిడనకు గురి చేస్తూ వారిని దోచుకుంటున్నారని విమర్శించారు. తమ ఆర్థిక రాజకీయ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి విద్వేష రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని అంతం చేసి మతోన్మాదాన్ని మనువాదాని అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మనుస్మూతి పుట్టినప్పటి నుండి మరణించే వరకు మహిళలకు హక్కులను నిరకరించిందని అన్నారు. ఎంత పేదరికంలో ఉన్న హక్కులకు భంగం వాటిల్లితే చూస్తూ ఊరుకోరాదని, ప్రజలు జాగృతం అయి సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. బీజేపీని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ తన ఆలోచనలను ప్రభుత్వ విధానాలలో అమలు పరుస్తున్నదని, అందులో భాగంగా శాస్త్రీయ విద్యకు తిలోదకాలు ఇచ్చి మత ప్రాతిపదికన అంశాలు విద్యలోకి చొప్పించ్చిందని విమర్శించారు. ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో నెహ్రు అంబేద్కర్ బొమ్మలను ధ్వసం చేసిన ఆర్ఎస్ ఎస్ కు, భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని బీజేపీ కి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు.రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిందని,కానీ సమానత్వాన్ని ఇవ్వడంలో బీజేపీ నిరాకరిస్తున్నదని విమర్శించారు. భౌతిక దాడులు కేవలం మైనారిటీ లపై ఎందుకు చేస్తున్నారో ఎస్ సి, ఎస్టీ, బీసీ ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కులాలు మతాలు జాతుల మధ్య విభజన వాదాన్ని సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనం పొందుతున్న బిజెపి ఆలోచనా విధానాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. అమాయక ముస్లిం మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి వారిని దేశద్రోహులుగా చిత్రికరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదువేల మైనారిటీ పాఠశాలలను మూసివేశారని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటే తమ ఆటలు సాగవని, రాజ్యాంగాన్ని మార్చలేమని గుర్తించి ప్రజల మధ్య విద్వేష రాజకీయాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. అటల్ బీహారి వాజపేయ్ మైనారిటీలు లేకపోతే ప్రభుత్వాలు సైతం నిలబడవు అన్న మాటలు బీజేపీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. నాడు కాంగ్రెస్ ప్రకటించిన ఏమర్జెన్సీ సైతం నేడు,బీజేపీ మత పరంగా విభజించి గొడవలు సృష్టించి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు. సెక్యులరిజం కోసం నిలబడాలంటే దమ్ము ధైర్యం ఉండాలని మైనారిటీలుగా మేము నిలబడాతము మీకు ఆ దమ్ము ఉందా అని ప్రశ్నించారు. మైనారిటీలను ఎంత అనగదొక్కితే అంత ఉవ్వేతున్న దేశ భక్తి తో భారతదేశ అభివృద్ధి కోసం పనిచేస్తారని అన్నారు.ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ... మైనార్టీలు విద్య ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఏ రాజకీయ పార్టీ వచ్చిన మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకుంటున్నారని అన్నారు. ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలలో రిజర్వేషన్ లు కల్పించాలని అంబేద్కర్ రాజ్యాంగ ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మైనారిటీ కార్పొరేషన్ నుండి యువకులకు, భిన్న కులాలకు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బ్యాంకు లింకు లేకుండా రుణాలు ఇవ్వాలని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేసారు.. ఈ సందర్భంగా తెలంగాణ గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం,ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ సరిత మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నదని, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించి,సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తున్నదని అన్నారు.ఈ బహిరంగ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జబ్బార్,సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, న్యాయవాది మధుసూదన్ బాబు, అఖిల పక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు తాహేర్,మాజీ కౌన్సిలర్ ఇషాక్ ఇక్బాల్ పాషా సుంకర ప్రభాకర్ కుర్వ పల్లయ్య, గంజిపేట రాజు, సీఐటీయూ వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, మహిళా సంఘం నర్మదా, వివిధ సామాజిక ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈసారి జన్మదిన వేడుకలకు బండి రమేష్ దూరం

**పారిశ్రామిక వాడ, కల్తీ కల్లు మృతులకు ఆత్మశాంతి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన బండి రమేష్**



కూకట్‌పల్లి, జూలై 13 (నమస్తే ఉదయం) సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనలో, హైదర్ నగర్ లో కల్లు తాగి మృతి చెందిన బాధితులకు సంతాపసూచకంగా ఈసారి తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంటు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ (మంగళవారం) తాను జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదని బండి రమేష్ ప్రకటించారు. ఇటీవల ఐ డి ఏ పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచి పరిశ్రమలో భారీ రియాక్టర్ పేలిన సందర్భంగా జరిగిన పేలుడు ఘటనలో 52మంది, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ లో కల్లు తాగి 9 మంది మరణించిన నేపథ్యంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదన్నారు. ఆయా మృతులకు కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బండి రమేష్ తెలిపారు.

## మహాలక్ష్మి అంశ బొడ్రాయి పండగ

**నూతనంగా ప్రతిష్టించిన బొడ్రాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామదేవతకు ప్రతినిధిగా భావిస్తారు**

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**



కూకట్‌పల్లి, జూలై 13 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడలో యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ శీతలంబ బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గ్రామంలో అరిష్టం ఏర్పడినప్పుడు, కలరా, మశూచి లాంటి వ్యాధులు ఆ ఊర్లోకి ప్రవేశించకుండా గ్రామస్థులు బొడ్రాయి ప్రతిష్ట చేస్తారని, దీనిని మహాలక్ష్మి అంశగా భావిస్తారని ఈ బొడ్రాయి ప్రతిష్ఠిస్తే ఆ గ్రామానికే చలువ చేకూరుస్తుందని అన్నారు. నూతనంగా ప్రతిష్టించిన బొడ్రాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామదేవతకు ప్రతినిధిగా భావిస్తారని, ఇది గ్రామానికి ధ్వజస్థంభం లాంటిదని, ఈ బొడ్రాయి ప్రతిష్టించే ఆ గ్రామంలోని ప్రజలకు శుభం చేకూరుతుందని పేర్కొన్నారు. అలాగే పెళ్లిళ్లు చేసుకుని వెళ్లి వేరే చోట ఉండే ఇంటి ఆడపడుచులందరినీ పిలిపిస్తారని ఆడపడుచుల ఆశీస్సులు గ్రామానికి కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుగేందర్ రెడ్డి, బందిగా బాలనరసింహ, ఆకుల నరేందర్, శేఖర్ గజానంద్, ఇమ్ము, రాము గౌడ్, గ్రామ పెద్దలు, అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా తొట్టెల ఊరేగింపు, బోనాల పండుగ

**పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత**



కూకట్‌పల్లి, జూలై 13 (నమస్తే ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాలినగర్ భోనాల జాతర సందర్భంగా ఆశానగర్ దాతి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఉరేగింలో లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, ఎడుపాయల శ్రీను, సూరిబాబు, సంగారెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 6 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

**రూ.3,210 నగదు,సెల్‌ఫోన్లు సీజ్**



శంషాబాద్, జూలై13 (నమస్తే ఉదయం)పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శంషాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..
పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండుపల్లిలో 5స్టార్‌గ్రాండ్ హెూటల్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆరుగురు వ్యక్తులు బెట్టింగ్‌లు పెట్టుకొని మూడు ముక్కలాట ఆడుతున్నారు.వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.3,210 నగదుతో పాటు ఆన్‌లైన్ లావాదేవిలు,ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తొండుపల్లికి చెందిన అంజయ్య,ఊటుపల్లికి చెందిన ప్రదీప్,జైపాల్,ఎం.రాజు,కిషన్‌గూడకు చెందిన కొండరాజు,బాలపూర్‌కు చెందిన నిఖిల్‌కుమార్, హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌కు చెందిన తిరుపతిరావు,లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మార్కండేయ నగర్ పోచమ్మ దేవాలయం నూతన కమిటీ ఎన్నిక



రాజేంద్రనగర్, జూలై 13(నమస్తే ఉదయం) మార్కండేయ నగర్ పోచమ్మ దేవాలయం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరాంజనేయ స్వామి దేవాలయం అధ్యక్షుడు గద్దె కృష్ణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.
దేవాలయం అధ్యక్షుడిగా శిరందాస్ నరేందర్, ఉపాధ్యక్షులుగా యాదగిరి భాస్కర్, మామిడి శెట్టి శ్రీనివాస్, భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా కోట పవన్, సహాయ కార్యదర్శులుగా ఉడుత సురేష్, గుత్తి మల్లేష్, కోశాధికారిగా కోటా శ్యామ్, కార్యవర్గ సభ్యులుగా కైరం కొండ శంకర్, ఎస్. ప్రభాకర్, రావుల నవీన్, మూసం నరేష్, విజయ్ యాదవ్, శశిరాజ్ యాదవ్, ఎర్వ మహేష్, కాల రాజు, బి రాము లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా గద్దె కృష్ణ, పగిడిమర్రి సూర్యనారాయణ, వాసు, విడెం రమేష్, వర్కాల చందు, మునగపాటి విష్ణు, గద్దె యాదగిరి లు నియామకమయ్యారు. నూతన కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని గద్దె కృష్ణ తెలిపారు. రాబోయే బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకునేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

## ఘనంగా శ్రీ వెంకటగిరి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కొత్తకోట, జూలై 13(నమస్తే ఉదయం) కొత్తకోట పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటగిరి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని కలిగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## పల్లెలకు చేరని ప్రగతి రథ చక్రాలు



గట్టు, జూలై 13(నమస్తే ఉదయం)లాభాపేక్షలేకుండా ప్రయాణికులను గమ్యస్థానం చేర్చేందుకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన పల్లెవెలుగు బస్సులు జాతీయ రహదారులకే పరిమితమయ్యాయి. పేరులో పల్లె వెలుగున్నప్పకీ, గ్రామాల గుమ్మాలను కూడా ఆ బస్సులు తొక్కడం లేదు. దీంతో బస్సుల లక్ష్యం గమ్యం చేరట్లేదు. జిల్లాలో బస్సు సౌకర్యం లేని గ్రామాలు చాల ఉన్నాయి. మండల కేంద్రాలకు మినహా మిగిలిన ఏ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడిచే పరిస్థితి లేదు. గట్టు,కేటిదొడ్డి, ధరూర్ మండలంలోని మిట్టదొడ్డి చాగదోణ, కొత్తపల్లె, మల్లంపల్లె, లింగపురం, చిన్నొనిపల్లె, ముచ్చొనిపల్లె చామన్ ఖాన్ దొడ్డి, బోయలగుడెం, ఇందువాసి బస్సపురం, సిద్దన్ పల్లె తాండ, మల్లపురం, కుచినెర్ల, పాతపాలెం, మైలగడ్డ ఇర్కిచెడు పాగుంట వెంకటపురం కొండపురం, కొత్తపాలెం, గిరిజన తండాలతో పాటు అనేక గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు సౌకర్యాలు లేవు. అంగట్లొ అన్ని ఉన్న అల్లునినోట్ల శని ఉన్నట్లు తెలంగాణ రాష్టం ఏర్పడిన కొత్త జిల్లాలు ఏర్పడిన తమ పల్లెలకు పల్లె వెలుగు బస్సుల సౌకర్యం నోచుకోని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోయారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టకంగా ప్రవేశపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన అవి ఏమి నొచుకోని గ్రామాలు అనేకం ఉన్నాయి.

**ఆటోలు,బొలేరో వాహనాలే శరణ్యం..**

గట్టు, కేటిదొడ్డి, ధరూర్ మండలాలో ఒకప్పుడు ఏ మారుమూల ప్రాంతం చూసినా ఎర్రబస్సులు తలుక్కుమనేవి. తరువాత ఏటికేడు ఆర్టీసీ బస్సులను తగ్గించేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఆటోలు, బొలేరో వాహనాలు దిక్కయ్యాయి. ఫలితంగా ప్రైవేటు వాహనదారులు ఆర్టీసీ కన్నా అధిక చార్జీలు వసూలు చేస్తు న్నారు. తద్వారా ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దీనికితోడు ఆటో నిండేవరకు గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కిక్కిరిసేలా.., పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయాందోళనలకు చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, పాలకులు ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పూర్వం రద్దు చేసిన బస్సులతో పాటు నూతన రహదారులకూ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

## గోల్కొండ ఎల్లమ్మ అమ్మవారికి బోనం సమర్పించిన కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్


గోల్కొండ లో అమ్మవారికి బోనం సమర్పరిస్తున్న అరుణ్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు

నార్సింగి, జూలై 13(నమస్తే ఉదయం) చారిత్రాత్మక గోల్కొండ ఎల్లమ్మ తల్లికి నార్సింగి మున్సిపాలిటీ వడ్డీ నాగులపల్లి కి చెందిన కాంగ్రెస్ నాయకులు బుడాల అరుణ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఆదివారం ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్ కుటుంబ సభ్యులతో బోనం తో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు. సందర్భంగా అరుణ్ ముదిరాజ్ మాట్లాడుతూ... ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు

## కాలేజ్‌కు వెళ్లమని చెప్తే మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య



మల్దకల్, జూలై 13(నమస్తే ఉదయం)బుద్ధిగా చదువుకోవాలని తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలం ఉలిగెపల్లి గ్రామానికి చెందిన కురువ కిష్టయ్య సుజాత దంపతులకు హరికృష్ణ, గోవర్ధన్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కిష్టయ్య పెద్ద కుమారుడు హరికృష్ణ(16) ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 546 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ కోసం చౌటుప్పల్ కోని టీజీఅర్ జేసి గురుకుల కళాశాలలో( ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతుండు. హరికృష్ణ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. అయితే ఇటీవల ఇంటికి వచ్చిన హరికృష్ణ చదువు మానేసి తాను కూడా పొలం పనులు చేస్తానని తండ్రితో చెప్పాడు, కళాశాలకు వెళ్లనంటూ తల్లిదండ్రుల వద్ద మారాం చేశాడు. తల్లిదండ్రులు బుద్ధిగా చదువుకొని ప్రయోజకుడు కావాలని నచ్చజెప్పి పంపించారు. ఈ నెల 12వ తేదిన హరికృష్ణ చౌటుప్పల్‌లోని కళాశాలకు బయలుదేరాడు. ఎర్రవల్లి చౌరస్తా వరకు వెళ్లి తిరిగి గద్వాలకు వచ్చాడు. పాతబస్టాండ్ సమీపంలో పురుగుల మందు సేవించి, అపస్మారక స్థితిలో కి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స కోసం గద్వాల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

## బీసీలను సంఘటితం చేయాలి: దాసు సురేశ్

**బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలి**



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 13(నమస్తే ఉదయం)రాష్ట్రంలోని బీసీలందరినీ సంఘటితం చేస్తామని, రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధిక బీసీ జనాభా ఉన్న రాజకీయ అవకాశాలు లేక వెనకబడి పోతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 42% బిసి రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ తేవడం అభినందనీయమని, కేంద్రంలో బిల్లు పాస్ కోసం ప్రధానిని కలిసి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో బీసీ సోదరులు ఐక్యమత్యంగా ముందుకు సాగి రానున్న స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి బీసీ పౌరుడు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికారం సంస్థ ద్వారా రాష్ట్రంలో తరచుగా సమావేశాలు నిర్వహించి వారి అభివృద్ధికి సంస్థ తోడ్పాటు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అక్కల రమా సాయిబాబా, బీసీ నాయకులు హాజరయ్యారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733